క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మానవపాడు: నాణ్యమైన విద్యుత్ అందించేందుకు మరమ్మతు కోసం గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ సయ్యద్ చిన్న మక్బుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మానవపాడులోని జల్లాపురం, మానవపాడు, పల్లెపాడు, బోరవెల్లి చండూరు, ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీలో ఉక్కపోత



ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామంలోని అంగన్‌వాడీ –2 కేంద్రాన్ని వీఎస్‌టీ సంస్థ నిర్మించిన వాటికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసినా ఫ్యాన్ లేక చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. నీటి కనెక్షన్, ఫ్యాన్ లేక చిన్నారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పథకాలు



మానవపాడు: కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, మరోసారి బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోరవెల్లి, చండూరు, జల్లాపురం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో కేంద్రం నిధులతోనే సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజగోపాల్, మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, నాయకులు బలరాంరెడ్డి, రాజశేఖర్‌శర్మ, లక్ష్మీనారాయణ, జగన్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు

కేటీదొడ్డి: ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. బుధవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని మల్లాపురంతండా నుంచి సిద్దన్‌పల్లి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మల్లాపురంతండాకు చెందిన డ్రైవర్ రాములుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

గద్వాల వ్యవసాయం: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ యూఆర్ రమేష్ అన్నారు. బుధవారం స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో మల్దకల్ మండల లైవ్ స్టాక్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర్లు నలభై ఏళ్ల పాటు చిత్తశుద్ధితో విధులు నిర్వహించారని చెప్పారు. టీఎన్‌జీఓ నాయకులు భీమన్న, బీజాపూర్ ఆనంద్, నాగార్జునగౌడ్‌లు మాట్లాడుతూ పలు గ్రామాల్లో వెంకటేశ్వర్లు పశువైద్య సేవలు అందించి, రైతుల మన్ననలు పొందారని కొనియాడారు. అనంతరం వెంకటేశ్వర్లు దంపతులను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీలు డాక్టర్ వెంకటనారాయణ, డాక్టర్ జ్ఞానశేఖర్, డాక్టర్ శ్రీనివాసులు, టీఎన్‌జీఓ నాయకులు శ్రీశైలం, వరప్రసాద్, పలువురు పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతు



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల, కొంకల గ్రామాల్లోని చేతిపంపులకు మరమ్మతులు చేపట్టారు. మండల ఎంపీఓ తిరుపతన్న, గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేయించారు. వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీఓ తెలిపారు. మిషన్ భగీరథ నీరు తక్కువ వచ్చిన సమయంలో చేతిపంపులను ఉపయోగించి నీటి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు ఎంపీఓ సూచించారు.

ఆదర్శంగా ఉండాలి

మానవపాడు: విద్యార్థులు కష్టపడి చదివి పదిమందికి ఆదర్శంగా ఉండాలని గ్రామపెద్దలు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని చెన్నిపాడులో ఎంబీబీఎస్ విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన చెన్నిపాడుకు చెందిన విజయ్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు.

బైరాపురంలో ఎండిన బోర్లు

- మిషన్ భగీరథ నీటితోనే కాలక్షేపం
- బోర్ల మరమ్మతుపై పట్టింపులేదు
- గంట మాత్రమే నీరు.. తర్వాత కన్నీరే!
- అడుగంటిన జలాలు.. అల్లాడుతున్న ప్రజలు
- మూగజీవాలకు నీరు లేక ఇబ్బందులు



బైరాపురంలో బైక్‌పై నీళ్లు తీసుకెళ్తున్న వ్యక్తి



బడి ఆవరణలో నీటి ట్యాంకు



ఎండిన బోరు మోటారు

ఉండవెల్లి: గ్రామాల్లో అప్పట్లో బోర్లు, బావులలో నీటిని తెచ్చుకునేవారు ప్రజలు. బైరాపురంలో మిషన్ భగీరథ నీరు వస్తున్నాయి. కానీ మిషన్ భగీరథ నీరు రాకపోతే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. కొందరికి మిషన్ భగీరథ నీరు ఒక గంట, రెండు గంటలు వస్తాయి. డీ బూడిదపాడు గ్రామానికి రెండు ట్యాంకులలో నీటిని నింపి మిషన్ భగీరథ, నీటిని కుళాయిలకు సరఫరా చేస్తారు.

మూడు బోర్లున్నా రిపేరు లేదు..

బైరాపురంలో 1400 మంది ప్రజలు ఉన్నారు. వారికి మిషన్ భగీరథ నీరు రాకుంటే బోర్లు ఉన్నా అవి పనిచేయని పరిస్థితి ఉంది. గ్రామంలో మూడు బోర్లు ఉన్న వాటిని రిపేరు చేసినా నీటి మట్టం లేని పరిస్థితి. శివాలయం వద్ద బోరు ఉన్న అది పనిచేయడం లేదు. అంగన్‌వాడీ కేంద్రం ముందు బోరు రిపేరు చేసినా నీరు లేక వృథాగా ఉంది. బస్వాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో ఒక బోరు మరమ్మతు చేస్తున్నారు. ఇలా మిషన్ భగీరథ నీరు లేకుంటే, బోర్లు పనిచేయకుంటే ప్రజల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. మూగజీవాలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలలో నీటి ట్యాంకు, ఎస్సీ కాలనీలో ఒక నీటి ట్యాంకు ద్వారా నల్లాలకు నీరు చేరుతోంది. బోరు పనిచేస్తే నీరు పుష్కలంగా ఉంటుంది.

అధికారులే రారు.. పట్టించుకోరు



మా గ్రామానికి కొత్త పంచాయతీ కార్యదర్శి ఇంతవరకు రాలేదు. సమస్యలు చెబుదామంటే సర్పంచులు పదవిలో లేరు. ఎవరిని అడిగినా మాకు తెలియదంటున్నారు. ఒక బిందెడు నీటి కోసం అరగంట వేచి చూస్తున్నాం. మిషన్ భగీరథ నీరు బందైతే, బోర్లలో నీరు ఉందో లేదో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

– వాసుదేవుడు, బైరాపురం

గంటపాటు నీళ్లు వస్తే గగణమే..



గంటపాటు మిషన్ భగీరథ నీరు అందించడం గగణంగా మారింది. కొద్ది రోజులు ఇలాగే ఎండలు పెరిగితే ఉన్న నీరు, బోర్లు ఎండిపోయే పరిస్థితి ఉంటుంది. నీటి కోసం కష్టాలు పడుతున్న పరిస్థితి అధికారులకు ఎలా అర్థమవుతుంది.

– చిన్న మద్దిలేటి, బైరాపురం

బోర్లు రిపేరు చేయించాలి..



మిషన్ భగీరథ నీటికోసం వేచి చూస్తున్నాం. అందరు పనుల కోసం వేచి చూస్తే, మా గ్రామంలో కులాయి నీటి కోసం వేచి చూడాల్సి వస్తోంది. నీటికోసం జగడాలు అధికమయ్యాయి. ఇప్పటికైనా బోర్లు రిపేరు చేయించాలి. దూరం వెళ్లి వృద్ధులు నీటిని తెచ్చుకోలేని పరిస్థితి ఉంది.

– మణెమ్మ, బైరాపురం

వడదెబ్బకు గురికాకుండా ఉండండి



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న శివతేజ

అయిజ: వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రతలు తీసుకోవాలని డాక్టర్ శివతేజ సూచించారు. బుధవారం మండలంలోని తొత్తినోనిదొడ్డిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్ శివతేజ గ్రామస్తులకు వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రతలు తెలిపారు. వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్ర 5గంటల వరకు ఎండలోకి వెళ్లరాదని తెలిపారు. తప్పని పరిస్థితుల్లో ఎండలోకి వెళ్లాల్సి వస్తే తలపై గొడుగు, టోపీ, వస్త్రం ఏదో ఒకటి పెట్టుకోవాలన్నారు. వీలైనన్ని సార్లు మంచినీరు తాగాలని సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తులను నీడలోకి తీసుకెళ్లి చల్లటి నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరంపై రుద్దాలని అన్నారు. చల్లటి గాలి తగిలే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయ కుమారి, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ జెండావిష్కరణ



మల్దకల్‌లో జెండావిష్కరణలో పాల్గొన్న యూనియన్ నాయకులు

మల్దకల్: ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్దకల్‌లో బుధవారం జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 327 యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్రాములు ఆధ్వర్యంలో 327(ఐఎన్‌టీయూసీ) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. యూనియన్‌కు సంబంధించిన ఉద్యోగుల సమస్యలు నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు యూనియన్ లీడర్లు తెలిపారు. యూనియన్ బలోపేతానికి ప్రతి ఉద్యోగి సహకరించాలని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. 14 మంది ఉద్యోగులు యూనియన్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీధర్, వర్కింగ్ ప్రసిడెంట్ ప్రభాకర్‌గౌడు, స్టేట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వెంకట్రాములు, కార్యదర్శి అశోక్, దేవేంద్రాచారి, ఉదయ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, పురుషోత్తం, భాస్కర్, యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

తాగునీటి కోసం రూ.33.50లక్షలు

ఎర్రవల్లిచౌరస్తా: వేసవిలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం రూ.33.50లక్షలు మంజూరు చేసిందని వాటర్ గ్రిడ్ ఏఈ వంశీసాగర్, ఎంపీఓ భాస్కర్ తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని వారు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులకు తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం నుంచి రూ.33.50 లక్షల ప్రత్యేక నిధులు విడుదల చేసిందన్నారు. కార్యదర్శులు తాగునీటి సమస్య తీవ్రంగా ఏ గ్రామాల్లో ఉందో గుర్తించాలన్నారు. దీని ద్వారా గ్రామాల్లో ఉన్న పాత బోర్లను వెంటనే రిపేరు చేయించాలన్నారు. తాగునీటి ట్యాంకులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడైనా తాగునీటి పైప్ లైన్లు లీకేజీ అయితే వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులకు గురికావద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు అన్నదానం



శాంతినగర్‌లో శ్రీశైలం పాదయాత్ర భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు



జూలెకల్ స్టేజీలో టార్చిలైట్లు, మురుమరాలు పంపిణీ చేస్తున్న దాతలు


శాంతినగర్: మహరాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి కాలినడకన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్తున్న భక్తులకు దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. శాంతినగర్‌కు చెందిన నంబి ఆంజనేయులు, నంబి హనుమంతు, నాగరాజు, దొండె వెంకటేష్, శేఖర్, మాధవరావు, రమేష్, రామచంద్రారెడ్డిలు పాదయాత్ర భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

జూలెకల్ స్టేజీలో..

వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ స్టేజీలో శ్రీశైలం పాదయాత్ర భక్తులకు టార్చిలైట్లు అందజేశారు. రాత్రి వేళల్లో కాలినడకన వెళ్తున్న భక్తులకు సౌకర్యంగా ఉంటుందని జూలెకల్‌కు చెందిన రూపశ్రీ, సీతారామారావు దంపతులు టార్చిలైట్లు పంపిణీ చేశారు. భక్తులు వడదెబ్బకు గురవకుండా పుచ్చకాయలు, చల్లని మజ్జిగ, రస్నా, బిస్కెట్లు, మరమరాలు, విభూతి, కుంకుమలను పంచిపెట్టారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, ప్రమీల, నాగరాజు, శివరంజని, తన్మయిలు పాల్గొన్నారు.

పాదయాత్రికులకు పండ్ల పంపిణీ

రాజోళి: మండల కేంద్రానికి చెందిన యువకులు శ్రీశైలం వెళ్తున్న పాదయాత్రిలకు బుధవారం పండ్లు పంపిణీ చేశారు. పాదయాత్రగా వెళ్తున్న భక్తుల వద్దకు వెళ్లి అరటి పండ్లు, బిస్కెట్లు, మజ్జిగ అందజేశారు. వేసవి తాపం తగ్గించుకునేందుకు వారికి మజ్జిగ అందించి, వారి సేవలో తరిస్తున్నట్లు యువకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శివరామయ్య, వీరేష్, రాజు, రమేష్, వెంకటేష్, రాము, విజయ్, గోవిందు, వినోద్ పాల్గొన్నారు.



పండ్లు అందజేస్తున్న రాజోళి యువకులు

నేడు ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి రామన్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉడిపి పలిమారు పీఠాధీశ్వరులు పనమపూజ్య విద్యాధీశ తీర్థులు, శ్రీ విద్యా రాజేశ్వర తీర్థ స్వాములు హాజరై కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిరంతరం సాధన చేయాలి



అయిజ: క్రీడాకారులు నిరంతరం సాధన చేసి నైపుణ్యం పెంచుకోవాలని ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్న తాండ్రపాడులో ఉగాది పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ విజయ భాస్కర్ బ్యాటింగ్ చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, ముఖ్యంగా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాల్లో కోటా ఉంటుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లికి చెందిన గద్వాల రాముడు అనారోగ్యంతో అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతురాజు సోమనాద్రి, ఎ ల్యూరు శ్రీనివాసులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. వారి వెంట యువరాజు, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లారెడ్డి, నారా యణ, రామ్‌రెడ్డి, జాకీర్, హనుమంతు ఉన్నారు.

వైద్య పరికరాలు అందుబాటులోకి తేవాలి



గద్వాల రూరల్: ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 2డీ ఈకో, అల్ట్రాసౌండ్ పరికరాలు వృథాగా పడి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీనియర్ సిటీజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు అన్నారు. బుధవారం ఆయన కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వాటికి సంబంధించి సరైన టెక్నీషియన్లు లేక సంవత్సరం కాలం నుంచి వృథాగా పడి ఉన్నాయన్నారు. వాటిని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వినతిలో కోరారు.

పాఠశాలల్లో మౌలిక వసతులపై ఆరా



గట్టు దళితవాడ పాఠశాలలో వివరాలను నమోదు చేసుకుంటున్న పీఆర్ ఏఈ

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై అధికారులు ఆరా తీస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు 'అమ్మ ఆదర్శ పాఠశాల' పేరున అన్ని సౌకర్యాలను కల్పించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు బుధవారం పంచాయతీ రాజ్ ఏఈ లక్ష్మన్న గట్టులోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. తాగు నీటి వసతితో పాటు విద్యార్థులకు అవసరమైన వసతుల గురించి వివరాలు సేకరించి, ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏఈ లక్ష్మన్న తెలిపారు. పాఠశాలల వారీగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అక్కడ అవసరమైన వాటి గురించి వివరాలను సేకరించి, ఉన్నతాధికారులకు పంపుతామని అధికారులు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మహేష్

గట్టు: యాసంగిలో రైతులు పండించిన వరిని కొనుగోలు చేసేందుకు బుధవారం గట్టులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని సహకార శాఖ సబ్ రిజిస్ట్రార్ మహేష్ ప్రారంభించారు. రైతులు యాసంగిలో పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తి స్థాయిలో తీసుకుంటామని మహేష్ తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గట్టు మండలానికి గట్టు, పెంచికలపాడు, ఆలూరు, మాచర్ల, చింతలకుంట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వగా ప్రస్తుతం గట్టులో మాత్రమే కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు సహకార సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ నర్సింహులు, కార్యాలయ ఉద్యోగులు వై.వెంకటేష్, వెంకటేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాదిగలను విస్మరించారని రాస్తారోకో



బల్గెరలో రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గట్టు: కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ల కేటాయింపులో మాదిగలను విస్మరించిందని ఎమ్మార్పీఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి తీరుకు నిరసనగా బుధవారం కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి బల్గెర రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు, బస్సులు ఎక్కడికక్కడ ని లిచి పోయాయి. ఆందోళన చేస్తున్న వారికి ఎస్ఐ రామకృష్ణ సర్దిచెప్పి, ఆందోళన విరమించేలా చర్య లు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న, జిల్లా కో కన్వీన ర్ బండారి డేవిడ్, ఎమ్మెస్పీ జిల్లా సీనియర్ నాయకులు మిట్టదొడ్డి ఇమ్మానియేలు మాట్లాడారు. ఎ మ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మా దిగ ఆదేశాల మేరకు ఆందోళన చేపట్టినట్లు తెలిపా రు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నట్లు ఆరోపించారు. తెలంగాణలో ఎస్సీలకు సంబంధించిన 3 ఎంపీ స్థానాలను మాదిగలకు కేటాయించకుండా మాలలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. మాదిగల పట్ల తీరు మార్చుకోక పోతే ఇ బ్బందులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముక్కెరయ్య, నర్సింహులు, సామేలు, ఆరగిద్ద తిమ్మప్ప, ఇందువాసి భీమన్న, సాకే సుదర్శన్, యోహాను, అజయ్, రాజేష్, బజారి, దానియేలు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో గ్రామాల్లో కవాతు



మానవపాడులో కవాతు నిర్వహిస్తున్న ఐటీబీటీ విభాగం బలగాలు

మానవపాడు: రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఐటీబీటీ విభాగం (ఇండో టిబేటాన్ బోర్డర్ పోలీస్) ఇన్‌చార్జి ఎస్ఐ కైలాస్ రామ్, మానవపాడు ఎస్ఐ సంతోష్‌ల ఆధ్వర్యంలో మానవపాడు, అమరవాయి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని తెలిపారు. ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినట్లైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 50 మంది సభ్యులతో గ్రామాలోని పూర వీధుల గుండా కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉస్సేన్ సాహేబ్ తాత ఉత్సవాలు ప్రారంభం



గంధం ఉత్సవాల్లో పాల్గొన్న ఉస్సేన్‌సాహేబ్ తాత శిష్య బృందం



తనగలలో వెలసిన ఉస్సేన్ సాహేబ్ తాత

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంలో వెలసిన ఉస్సేన్ సాహేబ్ తాత గారి ఉర్సు ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గంధం కార్యక్రమం ఉస్సేన్ సాహేబ్ తాత గారి శిష్యులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉర్సు ముబారక్, శుక్రవారం కిస్తీ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

మానవపాడు: ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని, వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల్లో తగు ఏర్పాట్లు చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని పల్లెపాడు, నారాయణపురం, చెన్నిపాడు, మానవపాడు తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలు అందరూ ఉదయం 6గంటల నుంచి 11.30 వరకు, సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు పనులు చేయాలన్నారు. పనిచేయు ప్రదేశంలో తాగునీటి సౌకర్యం, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్సకు సంబందించి బాక్స్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. రెండు నెలల్లో 100 రోజులు పనులను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఒక జాబ్ కార్డు ఉన్న దాదాపు రూ.30వేల వరకు ఉపాధి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఏపీఓ విజయశంకర్, ఏపీఎం బీమన్న, టెక్నికల్ అసిస్టెంట్ చెన్నకేశవులు, మాధవయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నర్సింగరావు